కథానిక

# రెండు ఉత్తరాలు

రంధి సోమరాజు

ఈ నగరాన్ని విడిచిపెట్టి అమలాపురం రేపు బయలు దేరాలనుకొంటూ వుండగా పోస్టు మేన్ రెండు ఉత్తరాలు తీసుకొచ్చి పడేశాడు.

రెండింటి వైపు ఒకసారి తొంగిచూశాను. అచ్చుఅక్షరాలు సయితం తలవంచే వ్రాతవ్రాసే, విశాఖపట్నం మిత్రుడు కామేశ్వర్రావు ఒక ఉత్తరం చిరునామాలోంచి కిలకిల నవ్వుతున్నాడు. రెండవది రాజమండ్రి మిత్రుడు శివరావు వ్రాసినది. ఇతని అక్షరాలను చూస్తే భయమేస్తుంది. వాటి లోంచి బయట పడిరావడం, ముళ్ళ డొంకల్లోంచి క్షేమంగా ఇవతల పడటం లాంటిది.

కాని ఇద్దరూ సహృదయులు. కామేశ్వర్రావు అతని అక్షరాలెలా ఉంటాయో, అతనూ అలాగే ఉంటాడు. కాని శివరావు అతని అక్షరాల్లా వుండడు. వాటికీ అతనికీ సంబంధమే లేదు. అతని దస్తూరిని చూసి ఎంత ఏవగించుకుంటామో, అతన్ని చూసి అంత మెచ్చుకుంటాము.

నేను నాలుగు సంవత్సరాలక్రితం విశాఖపట్నంలో ఉన్నప్పుడు, కామేశ్వర్రావుకూ నాకూ పరిచయమయింది. ఒక సంవత్సరమంతా అతనితో ఎంతో హాయిగా గడిపాను. ఆ తరువాత రాజమండ్రి వచ్చిన కొన్నాళ్ళకు శివరావుతో స్నేహమేర్పడింది. ప్రస్తుతం నేను వీళ్ళిద్దరికూ ఇంత దూరంలో ఉంటూవున్నా ఈ వుత్తరాలు మాత్రం మమ్మల్ని ఎప్పుడూ సన్నిహితంగానే ఉంచుతున్నాయి. నేను చాలా చాలా బద్ధకస్తుణ్ణి కాబట్టి, ఆ మిత్రులిద్దరూ ఉత్తరాలడోసులు పరంపరగా నాలోకి పంపి నా బద్ధకాన్ని నయంచేయడం కద్దు!

ఈ విధంగా ఒకే రోజున ఈ ఇద్దరి మిత్రుల దగ్గఱనుంచీ ఉత్తరాలు రావడం, నా అనుభవంలో అదే మొదటిసారి అందుమీదుగా ఆ రెండింటిలో ఏది ముందుచూడాలా అన్న మీమాంస వచ్చింది. అక్షరాలు బాగున్నా బాగుండకపోయినా, అందులో ఏమైనా ఉన్నా ఉండకపోయినా నాకు శివరావు ఉత్తరాలంటే ఎంతో ఇష్టం. దీనికి కారణం చెప్పడానికి నా మనస్సు అదేమిటోగాని ఎప్పుడూ కన్నె మనసులా తెగ సిగ్గు పడుతుంది. కాని ఆరోజున నా మనసు అదేమిటోగాని, పైకి కనిపించే అందంవైపు లోక సహజమైన వాంఛ ప్రకటించింది. సరే...దాని ఇష్టానికి వ్యతిరేకంగా నడవడం ఇష్టంలేక మెల్లగా మా ముత్యాల మిత్రుడు...కాదు కాదు...మా విశాఖమిత్రుడు కామేశం ఉత్తరం చించాను.

తీరాచూస్తే అతనా జాబును విశాఖపట్నం నుంచి వ్రాయలేదు. అతను రాజమండ్రి నుంచి వ్రాశాడు. అరే...ఇదేమిటి పొరపాటు పడలేదు కదా అనుకొని, తిరిగి చూస్తే మాత్రం ఇట్లా అవమాన పఱచినందులకు, కళ్ళకు కోపం కలిగించడం తప్పించి ఫలితం దక్కలేదు. అసలు ఇంతకీ ఇతను రాజమండ్రి ఎప్పుడు వచ్చాడు? మనకు ముందుగా తెలియబరిస్తే శివరావు దగ్గఱకు డైరెక్టు చేద్దుంగా. ఇన్ని ఉత్తరాలు వ్రాస్తూఉన్నా, శివరావుగుఱించి నేను ఎప్పుడూ అతనికి ఒక్కముక్క వ్రాయలేదు. అయినా ముందుగా నాకు తెలియబఱచకుండా ఇతను రాజమండ్రి వెళ్ళడం ఏమిటి? నాకెందుకనో బాధ కలిగింది. అతనికి ఏవేవో సదుపాయాలు నా మూలంగా అక్కడ జరిగి ఉన్న పక్షంలో నా అంతరాంతరంలోని పొగడ్తల రాముడు ఎంత ఆనందించేవాడు! నాకు అట్టి అవకాశం ఇవ్వనందులకు కామేశం మీద నాకు కొంచెం చిరాకు కలిగిన మాట వాస్తవం. తీరా ఆ రెండో ఉత్తరం విప్పేటప్పటికి వాడు విశాఖపట్నం వేంచేయడు కదా...అని నాలో నేను నవ్వుకొని ఉత్తరంలోని విషయాల్లోకి కళ్ళను పరుగెత్తించాను.

రాజమండ్రి, 16–8–55.

డియర్ మూర్తీ,

నీకు పక్షం రోజుల క్రితం ఓ జాబు వ్రాశాను. సాధారణంగా నీదగ్గఱనుంచి దానికి జవాబు రావడమంటే మరో పక్షం రోజులు పట్టడం పరిపాటి. కాని విచిత్రంగా దానికి జవాబు మూడోనాటికి తిరిగొచ్చింది. నేను చాల ఆశ్చర్యపోయాను. నువ్వేమిటి...ఇంత త్వరగా వ్రాయడమేమిటని. దానితో నాకు భయమేసిందనుకో. కొంపదీసి ఇప్పుడు వెంటనే ఉత్తరం వ్రాస్తే...నువ్వు మళ్ళీ తిరిగి వెంటనే దానికి జవాబు వ్రాసేస్తే...అబ్బో! ఇది చాల ప్రయాసతో పని. నువ్వు జాగుచెయ్యడంలోని ఆంతర్యం నాకు ఇప్పుడు బోధపడింది.

సరే. ఇది ఇలావుంచు. ఈలోగా మనకు ట్రాన్స్ఫరయింది. అంతా హడావుడి. రాజమండ్రిలో ఉన్న ఓ మిత్రుడికి జాబు వ్రాయడం (మిత్రుడంటే మిత్రుడు కాదనుకో. ఓ స్నేహితుని సిఫార్సు ఉత్తరం ద్వారా స్నేహితుడు) అతను క్షణాలమీద ఓ దరిద్రగొట్టు కొంపచూడటం, మనం అందులో కాపురం పెట్టేయడం జరిగిపోయింది. ప్రస్తుతం వారం రోజులనుంచి ఈ వూళ్లో అఘోరిస్తున్నాను. ఇది ఏమి వూరో నాకు సుతరాము అర్థంకావడంలేదు. మరీ మా పొరుగాయన అబ్బబ్బ!..ఆయనతో మహా ఇబ్బందిగాఉందోయ్. మార్చేస్తున్నాలే. నెల అద్దె అడ్వాన్సు ఇచ్చాంగా. ఈ లోగా మరొకచోట ఎక్కడైనా చూసుకోవాలి. కాని అక్కడ మాత్రం ఇలాంటి పొరుగు ఉండదని ఏమిటి ఖరారులే. అయినా నేనిక్కడ ఎలాగూ ఉండేదిలేదు. ఇక్కడ కుళ్ళుకాల్వలకంపు దోమలబాధ బహు జాస్తీగావుంది. వీటిబాధకన్నా మా పొరుగు వాడితో వ్యవహారం మహా ఇబ్బందిగా వుంది. ఏమిటో నన్ను చూస్తే పచ్చి జారుణ్ణి చూస్తున్నట్లు చూస్తున్నాడు. అబ్బ! అతని చూపులు మహాభయంకరమోయ్. ఎప్పుడైనా హత్యచేస్తాడేమో అనిపిస్తూంది. అతనికి ఓ పెళ్ళికాని చెల్లెలుందిలే. ఆ పిల్ల ఎక్కడ ఎగిరిపోతుందో అని భయమనుకుంటాను. మా ఆవిడతో కూడ మాట్లాడనివ్వడు. దానికి తగ్గట్టుగా అమ్మాయిల దాహం ఉన్న అబ్బాయిలు, ఈ యెండ మావి చుట్టూ నిత్యం ప్రదక్షిణం చేస్తూండడం యమబాధగా వుంది. వాళ్లు కాలేజికి పోయేమార్గ అదేలే. ఈ పిల్ల చదువు ప్రస్తుతం ఇంటిదగ్గరే అనుకుంటాను. నేనొకటి రెండుసార్లు చూశాను. ఫరవాలేదు. కాని ఎప్పుడో ఎవడితోనో ఎగిరిపోతుంది. తప్పదు. ఎవరిలా, పోతే మనకేంగాని, ఇంతకీ అంత అనుమానం మనిషిని నేనెక్కడా చూడలేదనుకో. ఇరుగు పొరుగన్న తరువాత ఏమైనా అవసరాలుంటాయి. అందులో మేం క్రొత్తవాళ్ళం కాబట్టి, వాళ్ళతో సంప్రదించి తెలుసుకోవలన విషయాలేమైనా ఉండొచ్చు. సరే పోనీవయ్యా...చెప్పకపోతే చెప్పకపోయేరు. మేమేమిటో వాళ్ళకు వంకలు పెడుతున్నామని, వాళ్ళతో ఎవరో అన్నట్లు—ఆ ఇంటిలోంచి మమ్మల్ని తెగలిట్టిపోస్తున్నారనుకో. పగవాడికైనా వద్దోయ్ ఇటువంటి పొరుగు.

సరే...ఇక నే వూళ్లో ఇంకా ఏ సినిమాదరికీ పోలేదు. ఇక్కడ కాపురమే ఓ పెద్ద సినిమాలా వుంది. చికాగ్గా వున్నా నీకీట్రాన్స్ఫరు విషయం తెలియబరచాలని, గబగబా ఏమిటో బరికేశాను.

నాకు శాంతి ·నొసగే నీ ఉత్తరాన్ని పోస్టుమేన్ పావురం ఎంత త్వరగా తెస్తే అంత ఆనందిస్తాను.

ఇట్లు, నీ కామేశం.

ఉత్తరం ముగించానన్న మాటేగాని, నాకేమిటో ఆ వుత్తరం అంత నచ్చలేదు. కామేశం వ్రాసే అక్షరాలు ఎప్పుడూ ముత్యాల్లావుండేవి. కాని అవి ఇప్పుడు అలాలేవు. అంతేకాదు అతను ఇంతకు పూర్వం, చక్కని విషయాలు ఎంతో అందమైన భాషలో చాల తమాషాగా వ్రాసేవాడు. కాని ఇందులో నా కలాంటి వేమీ కనిపించలేదు.

సరే. ఇక శివరావు ఎలా వ్రాశాడో అనుకుంటూ ఆ వుత్తరాన్ని విప్పాను, దాన్ని విప్పినప్పుడు నా గుండె లెందుకో వేగంగా కొట్టుకున్నాయి. ఎందుకా అని పరీక్షించుకుంటూనే, ఆ విషయం మరచి, ఆ వుత్తరంలోకి తొంగిచూశాను. దాన్ని చదువుతూండగా కామేశం వ్రాసిన జాబులోని విషయాలు; సోడాబుడ్డి వేరొక ప్రక్కగా త్రిప్పి—త్రాగుతూన్నప్పుడు అడ్డుపడే గోళీకాయలాగ మాటిమాటికీ అడ్డురావడం మొదలుపెట్టాయి. నావంటి నిండా బాధల ప్రవాహాలు, ఆ వుత్తరాల

కొండల్లోంచి పుట్టి ప్రవహించడం మొదలు పెట్టాయి.

రాజమండ్రి
16-8-55.

మూర్తీ,

నీ దగ్గరనుంచి ఇంతవరకూ జాబు రాలేదు. దానికోసం ఇక్కడ రోజూ ఎదురుచూస్తూ వుంటాను. కాని అది రాదు. ఏమిటో బాధగా ఉంటుంది. నీవు బద్ధకస్తుడవని తెలుసు. కాని నీదగ్గరనుంచి వెంటనే జవాబు పొందాలని ఏమిటో మనసు ఉవ్విళ్ళూరుతూ వుంటుంది. అందుకనే మరి నీమీద ఎంతో కోపం వస్తుంది. ఇలాంటప్పుడు నువ్వు నాదగ్గర వుంటేనా...... నీకు పుణ్యముంటుంది; ఇది అందిన వెంటనే నాలుగుముక్కలు ఏమితోస్తే అవే గిలికి పారేద్దూ. నాకీమధ్య మరీ ఏమీ తోచటంలేదు. అందులో వారంరోజుల నుంచి, ఈ యింట్లో యమయాతన అనుభవిస్తున్నాను. మా ప్రక్కవాటాలో ఎవడో విశాఖపట్నంనుంచి దిగాడు. ఆ కోతివేసే వేషాలు చాల జుగుప్సాకరంగా వున్నాయనుకో... నేను కాబట్టి సహిస్తున్నాను. అతనిలో సంసారుల ఇళ్ళదగ్గర ముండవలసిన లక్షణాలు శూన్యం. నేనసలే పిచ్చివాణ్ణి. ఏరోజున ఏమిచేస్తానో నాకే భయంగా ఉంది. చదువుకీ... సంస్కారానికి సంబంధం లేదనుకో. వాడికి భార్యఉంది. పైగా ఒక నాలుగేళ్ళ పిల్లకూడ వుంది.

ఈ విషయాలు ఏమిటో నీకు తెలియబరిస్తేనే గాని మనసుకు శాంతి కలిగేట్లుగా కనిపించలేదు.

వెంటనే నీ వుత్తరం వస్తే, నాకు ఎంత ఆనందం కలుగుతుందో నీకెలా చెప్పగలను!

ఇట్లు, శివరావు

నా తల భూమికన్నా వేగంగా తిరిగింది. కమలను నేను గాఢంగా ప్రేమించాను. ఈ విషయం శివరావుకు తెలియదు. ఆమెకూడ నన్ను ఎంతో ఇదిగా ప్రేమించింది. నేను మా కుటుంబ పరిస్థితుల వల్ల ఆమెను ఇంకా పెళ్ళి చేసుకోలేకపోయాను. ఆమెను పెళ్ళి చేసుకోవడం పడదేమో అన్న భయంతోనే, నేను ఇప్పటివరకూ మా వాళ్ళకు దూరంగా ఉంటూ వచ్చాను. మొన్న మా మేనగోడలికి పెళ్ళి అయిపోవడంతో, నాకా అడ్డం తొలగిపోయింది. రేపు ప్రయాణమై మా నాన్నగారిని తీసుకొచ్చి, ఒక్కసారిగా శివరావు ఆశ్చర్యపడేట్లుగా చేయాలనుకున్నాను. కాని ఈ వుత్తరాలు చూస్తూవుంటే నాకేమిటో అంతా అయోమయమై పోయింది.

నేను విశాఖపట్నంలో ఉన్న సంవత్సరం పొడుగునా, ఒక్కరోజునకూడ కామేశ్వర్రావు నడవడిలో పరస్త్రీవాంఛ ఉన్నట్లు పసిగట్టలేక పోయాను. అతని మాటల్లోగాని, చేష్టల్లోగాని, ఎప్పుడూ స్త్రీ విషయమైన అభిరుచి కనపడలేదు. అలాంటప్పుడు నేనెలా అతన్ని అనుమానించడం?

అయితే కమలే... అతన్ని మాయ జేసిందా...? కమల నిజంగా మంచిది కాదనుకున్నా ఆమెకు, భార్య ఉన్నవాడితో సంబంధం ఎట్లా ఇష్టమాతుంది? అందులో కమల అలాంటి పిల్లగాదే... నన్ను ఎంత ప్రేమించింది! నేనెన్నిసార్లు ఆమెకు రహస్యంగా టాయిలెట్ సామాన్లు, చేతిరుమాళ్ళు, ఇవ్వలేదు! అయితే వాటినామె పుచ్చుకోడానికెప్పుడూ ఉబలాట పడలేదు. 'ఎందుకివన్నీ...' అనేది. ఇలాంటివన్నీ నీచమైన ప్రేమకు చిహ్నాలని వాటిని త్రోసి పుచ్చేది. అయినా ఏమిటో నాకు వాటిని ఆమెకు అందజేయాలనిపించేది. నా జ్ఞాపక చిహ్నంగా వాటిని ఉంచుకోమని ఆమెను ఇరకాటాన పెట్టేవాణ్ణి. ఇక వాటి నామె తప్పనిసరి అయి పుచ్చుకొనేది. ఎప్పుడుచూచినా ఏదో పుస్తకం చేతిలో ఉంచుకొని అలా తలవంచి చదువుకుంటూ వుండేది.

అయితే అసలు కామేశ్వర్రావు ఎందుకిలా వ్రాసేడు? అతని అంతరాంతరంలోని నీచమైన గుణాన్ని నేను కనిపెట్టలేకపోయానో ఏమో... అతను ఎంత నీచుడుగా కనిపిస్తున్నాడు! గుండ్రని అక్షరాలచాటున, మధురమైన సంభాషణల వెనుక, ఎంత సంస్కారహీనుడుగా అర్థమౌతున్నాడు! అతను మనిషిముందుతప్ప మనిషిగా ఉండలేడేమో.

అతని ఉత్తరం మరొక్కసారి చదివాను. 'నేను ఒకటి రెండుసార్లుచూశాను. 'ఫరవాలేదు. ఎప్పుడో ఎవడితోనో ఎగిరిపోతుంది తప్పదు' ఏమిటి వీటిలోని అంతర్యం? అంటే...ఆమె అతనికి చిక్కక పోవడంవల్ల కలిగిన బాధ అలా రాయించిందన్న మాట. అంతేఅయివుంటుంది. లేకపోతే అంత

మంచి లోకాలిటీలోంచి మకాం ఎత్తేస్తానని వ్రాయవలసిన కర్మఏమిటి? పాపం శివరావు కెంత బాధ కలిగించాడు! కామేశాన్ని అతను పచ్చి జారుడుగా, చూస్తున్నాడంటే అందులో ఆశ్చర్య పడవలసిందేముంది? 'అమ్మాయిల దాహం ఉన్న అబ్బాయిలు ఈ ఎండమావి చుట్టూ నిత్యం ప్రదక్షిణం చేస్తూండడం యమబాధగా వుంది' అన్న మాటలోని అర్థం ఏమిటి? కమల. ఎంతో మంచిదనే కదూ...కమలను ప్రేమించాను. అందువల్ల ఆ విద్యార్థులు అలా చూడడం సహించలేను అనే కదూ...

అబ్బే. అలా అయివుండదు. ఎంతో మంచివాడైన కామేశం, రాజమండ్రి రాగానే, ఇలా మారిపోయాడంటే అది అర్థంపర్థం లేనిమాట బహుశా శివరావే అతన్నిచూసి, అనవసరంగా కంగారుపడి అనుమానపడి ఉండొచ్చు. కమలను కామేశం వలచి ఉన్నట్లయితే, ఆ వీధిలోంచి వెంటనే మరొక వీధిలోకి మారిపోతానని ఎందుకు వ్రాస్తాడు? అతనికి నిజంగా కమలమీద మనసు ఉన్నపక్షంలో ఏ విధంగానైన శివరావుతో స్నేహం చెయ్యడానికే ఉత్సుకత చూపడానికి ప్రయత్నిస్తాడు కాని, అతనితో విరోధం పెట్టుకొని, ఏ విధంగా తన మనోరథాన్ని ఈడేర్చుకోగల ననుకుంటాడు? అంతే. శివరావు అనవసరంగా కామేశం అంటే లేనిపోని ఊహాలు పెంచుకొని అతనంటే ఏహ్యాభావాన్ని ప్రదర్శిస్తున్నాడు. అందరు మంచివాళ్ళు. అనవసరంగా ఒకర్ని చూసి ఒకరు అసహ్యించుకుంటున్నారు. భయపడుతున్నారు. అంతే అనుకున్నాను.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. తెలతెల వారుతుందనగా ఒక కలగన్నాడు.

ఒక్కసారిగా వెర్రికేకలు, విపరీతమైన వికటాట్టహాసాలు వినిపించాయి. అంతా చిట్టచీకటిగా వుంది వెంటనే ఏమిటో ఆ చీకటిరేయి 'వెన్నెలపాడరు' అద్దుకొని వెలవెల పోతూన్నట్లు కనిపించింది. ఇంతలో జనం...కోలాహలం హెచ్చింది. అల్లరి వినిపిస్తూంది. ఒక వీధిలోనే నేను ఉండడంలేదు. ఒక్కమనిషినే నేను చూడటంలేదు. విచిత్రంగా సమస్తాన్ని ఒకేచోటు నుంచి ఒకేసారి చూస్తున్నాను. అన్నివిషయాలు ఒక్కసారే అవగాహన చేసుకుంటున్నట్లు, ఒక్క విషయంలోంచే సమస్త విషయాలూ నాలో ధ్వనింపబడుతూన్నట్లు, అనుభవాన్ని, పొందుతున్నాను. ఇంతలో విద్యార్థిలా ఉన్నబొమ్మ ఒకటి నాముందు ఎవరివైపో చూసి తమాషగా నవ్వింది. ఆ నవ్వు నందిపుచ్చుకొని ఒక అందమైన అమ్మాయి నవ్వినట్లే అనిపించింది. వింతగా మరోక్షణంలో ఆ ఇద్దరూ మాయమైపోయినట్లు కనిపించింది. అంతా జనం...అంతా జనం అంతా అర్థమవుతూన్నట్టేవుంది... కాని...కాని ఏమీ తెలియడంలేదు. ఇంతలో చీకటి ఇంక ఇంకా నల్ల రంగు పులుముకుంది. ఆకసం అద్దంలో తనను తనే చూసుకుంది. పాపం దానికక్కడ తిరిగి ఏమీ కనిపించలేదు.

నేను కళ్ళువిప్పాను. నాకు చాల భయంవేసింది. రాజమండ్రి వెళ్ళనా మాననా అని పదేపదే ఆలోచించాను. అయ్యో...ఇన్నాళ్ళ ఇక్కడ ఎవరికోసం తపస్సు చేశానో..ఎవరికోసం ఆశలు పెంచుచున్నానో ఆమెను పొందకుండా, కనీసం చూడకుండా, అసలు సంగతి సందర్భాలేమిటో తెలుసుకోకుండా ఎలా ఉండడం? ఆమెను నేను పెళ్ళిచేసుకుంటానని ఎంత ఆశపెట్టాను! ఆమె ఆశలు అడియాసలు చెయ్యనా...ఇంతకీ ఆమెలో ఏమి తప్పు మాచాశాను? ఇదంతా నా భ్రాంతి. ఇదంతా మనస్సు చేస్తూన్న గారడీ అంతే. రాజమండ్రి వెళ్ళడం ఏ సందర్భంలోనూ మానకూడదు అని నిర్ణయించుకున్నాను.నిశ్చయించుకున్నాను. బెడ్డింగు సర్దుకున్నాను. సాయంకాలం కాగానే మెయిల్లో బయలుదేరాను.

మెయిలు పరుగెత్తుతూంది. తలలో ఆలోచనలు అసంఖ్యాకంగా బయలుదేరాయి. అంతక్రితం రాత్రి నిద్రలేకపోయినా, నాకు నిద్రరావడం లేదు. మనసులో కమల ఎంతో మంచిది. ఎంతో మంచిది అన్న ఊహాలు కెరటాల్లా విజృంభిస్తున్నాయి. ఇంతలో శివరావు, కామేశం ఒకరితో ఒకరు కలియబడి ఘోరంగా కొట్టుకుంటూన్నట్లు మనసు భయపడింది. కామేశం చేసేదిలేక ఇల్లు మారి పోతూన్నట్లు, శివరావు భయంకరంగా అరుస్తూన్నట్లు అనిపించింది. ఆ వెనువెంటనే శివరావు ఎప్పుడూ చేయని పాపమేదో చేసినట్లు అమిత

మైన దుఃఖంతో కుమిలి కుమిలి ఏడుస్తూన్నట్లు ఊహాల టెలివిజన్‌లోంచి నా కళ్ళు వీక్షించాయి'

అబ్బ! కామేశం ఆ విశాఖపట్నంనుంచి రాజమండ్రి వచ్చేప్పుడు, నాకు తెలియబరచివస్తే ఎన్ని అవస్థలు తప్పేవి! అతని బద్ధకం ఎంతపని చేసింది! ఏమిటో ఎంతమంది క్రొత్త మిత్రులను ఎంతమంది సంపాదించడంలేదు. అసలీగొడవకి కీలక మేమిటో. ఇంతకీ తీరా నేను అక్కడకువెళ్ళేప్పటికి, వాళ్ళంతా కలసి ఒకింట్లోనే కూర్చొని బాతాఖానీ వేసుకుంటూ వుంటే నా గుండెల్లో ఒక్కుమ్మడిగా సంతోష జలధులు పొంగి పొర్లాయి.

మరునాడు పదిగంటలకు రాజమండ్రిలో కాలు పెట్టాను.

నా గుండెలేమిటో నన్ను ఎన్నడూ లేనంతగా కలవరపెడుతున్నాయి. నా కాళ్లు నన్ను వెనక్కి తీసుకపోతున్నాయి. నాలో ఎవ్వరో తిన్నగా అమలాపురం వెళ్ళిపోమని నాకు చెప్పడం ఆరంభించారు.

రేవులోకి వెళ్ళి బొబ్బర్లంకలాంచీ ఎక్కనా అనుకుంటూనే రిక్షాను వేగంగా ఆ మిత్రుల ఇంటి ముందుకు తీసుక పొమ్మన్నాను.

నేను రిక్షాలో కూర్చున్నాను. అయితే నేను అందులో బ్రతికే ఉన్నానా అంటే అది చెప్పడం కష్టం!

అనుకున్నట్లుగానే వాళ్ళగుమ్మంముందు కొన్ని బళ్ళనిండా సామాను నింపబడిఉంది. మంచాలు, కుర్చీలు సమస్తమూ వాటిలో ఉన్నాయి. 'అరే పాపం... సెలకూడా తిరగకుండానే కామేశం ఇల్లు మారిపోతున్నాడు కాబోలు' అనుకున్నాను. రిక్షా ఇంకొంచెం ముందుకు వెళ్ళి ఆగేప్పటికి ఆ చివరి బండిలో కమల కూర్చొని ఉంది. అప్పుడే కమల చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వు ఏ దిశగా ప్రయాణించిందో ఆ దిశగా నా కళ్లు యంత్రంలా తిరిగాయి. అబ్బ! అక్కడ కామేశం చిన్నగా నవ్వాడు. అక్కడ కూతురు నెత్తుకొని నిలబడి ఉన్నాడు. ఇంతలోనే చప్పున అతని మొగంలోకి విషాద రేఖలేవో తరుముకొచ్చి నట్లయింది.

నా మనసు పనిచేయడం మొదలుపెట్టింది. కమల దూరమౌతూన్నందులకు కాబోలు, ఇంత లోనే, నవ్వి ఇంతలోనే విచారిస్తున్నాడు. అప్పుడే అతను నన్ను చూశాడు.

"ఒరే...మూర్తీ ... ఎప్పుడొచ్చావురా..." అంటూ నా దగ్గరకొచ్చాడు.

నా కళ్ళల్లో కోపంతో నీళ్ళు తిరిగాయి. కమల వైపు నా మొగం ఒక్కసారి తీక్షణంగాచూసింది. అప్పుడు కమల ఎంత చక్కగా నటించి దనుకున్నారు! 'ఏమిటి అలా వింతగా చూస్తారు?' అన్నట్లుగా మొగం పెట్టింది. నా గుండెల్లో సెగ పెట్టింది. నా లోనిబాధ కట్టలు త్రెంచుకుంది. వెంటనే, 'మిస్టర్ కామేశ్వర్రావ్ ఈ కమలమ్మగారిని నేను పెళ్ళి చేసుకోవచ్చా' అని అక్కడ క్షణంకూడా ఆగకుండా—అయ్యో...శివరావు.... అమాయకుడు... పెళ్ళికాని చెల్లెలును ఇంట్లో పెట్టుకొని, బాధలను పెంచుకున్నవాడు...ఎలా ఉన్నాడో...అనుకుంటూ అతను ఖాళీచేస్తున్న ఆ గదిలోకి వెళ్లాను. అక్కడ అతను గోడలనుంచి ఊడిరాని మేకులను పీకుతున్నాడు. అతను విడిపోని మనసులేవో విడదీస్తున్నాడా అనిపించింది.

నన్ను చూడగానే అతను 'నువ్వొచ్చావురా... నువ్వొచ్చావురా...' అన్నాడు. అతని మొగం నిండా బాధతో దహించుకు పోతూన్న అణువులు విలయనృత్యం చేస్తున్నాయి. కాని నన్ను చూసి నవ్వాడు. అది నవ్వని ఎవ్వరనగలరు?

'మూర్తీ...నా అంతిర్వాణి నీకు వినిపించి నట్లుగా వచ్చేశావురా...నేను మొన్న ఉత్తరం వ్రాశానుకదూ...అటువంటి వెధవ పొరుగున, మన లాంటి సంసారులు బ్రతకడం కష్టంరా...మీ సిష్టరు ఇంక ఒక్కక్షణం ఈ యింట్లో ఉండనని నన్ను వేపుకతినేసింది. పెళ్ళికాని చెల్లెలును పెట్టుకొని ఇటువంటి దుర్మార్గులున్న చోట ఉంటే లేనిపోని నిందలు ఇక తప్పక వస్తాయి అంది. ఇక వెంటనే కమలకు పెళ్ళికూడా చేసెయ్యమని నన్ను ముల్లుగర్రలా పొడుస్తూంది. నాకేమిటో కమల చదువు పూర్తయ్యే వరకు పెళ్ళిచెయ్యగూడదని ఉంది. కాని మీ సిష్టరుచేసే గొడవకు తట్టుకోలేక పోతున్నాను. రేపో ఎల్లుండో నీ దగ్గరకు రావాలనుకున్నాను. ఇంతలో నువ్వే వచ్చావు. నీ కభ్యంతరం లేకపోతే ... నన్నీ బాధలనుంచి విముక్తుణ్ణి చేద్దూ.' అన్నాడు. నా కళ్ళల్లోకి

ఆశగా చూశాడు. అక్కడ ఏమిటో వెదికాడు. పాపం...ఎంత అమాయకుడు కాకపోతే ఈ పరిస్థితుల్లో ఈ విషయాన్ని ఇంత మాయామర్మం లేకుండా చెప్తాడు. పాపం అతను కమలను అనుమానించలేదు. భార్య అనుమానించి ఉంటుంది. అంతే...ఇలాంటి విషయాలు ఆడవాళ్ళకు ఇట్టే తెలుస్తాయి. అందుకనే ఆమె భర్తనిలా తొందర చేస్తోంది...పాపం పిచ్చిశివరావుకు ఏమిచెప్పను. నువ్వుకూడ నన్ను మోసంచేయాలనుకుంటున్నావా అని చెప్పినా పరిస్థితులకు దాసుడవు నువ్వేంచేస్తావు అని చెప్పనా. కాని నేనుఏమీ చెప్పలేదు. నా గుండెల్ని కాల్చేస్తూన్న దుస్సహమైన ఆ బాధల కార్చిచ్చునుంచి తప్పించుకోడానికి అక్కడ ఇక క్షణంకూడనిలబడకుండా, బయట కామేశ్వర్రావు 'నామాటవిను...నామాటవిను...' అంటూవున్నా ఆగకుండా అక్కడనుంచి పారిపోయాను.

పారిపోతూండగా నా కొక్కసారి, 'కమల ఇందాక చూసి నవ్వింది కామేశాన్ని చూశా... లేక అతడెత్తుకున్న ఆ పాపను చూశా...' అని పించింది. నా కాళ్లు ఒక్కసారి కుంటుపడ్డాయి. నా గుండెల్లో ఏమిటో గతుక్కుమంది. అందుకనే కాబోలు కమల అలా ఆశ్చర్యపోయింది. కమలకు ఆ పాపంటే ఇష్టమేమో...

చీకటి సముద్రంలో నేను అట్టడుగున కొట్టుకుంటున్నాను. ప్రాణం పోవడంలేదు.

గోదావరి స్టేషనులో ఏరైలువస్తే ఆ రైలు ఎక్కివేయడానికి సిద్ధంగా కూర్చున్నాను.

ఇంతలో విచిత్రంగా అక్కడకు శివరావు కామేశ్వర్రావు లిద్దరూ వచ్చారు. వారి ఈ కలయికను చూసి నేను, 'కలకాదు కదా...' అనుకున్నాను. ఇద్దరూ, నా దగ్గరకు నవ్వుతూ వచ్చారు. నా తల పనిచేయడం మానేసింది-

ముందుగా కామేశ్వర్రావు, 'నువ్వు నన్ను క్షమించాలిరా పరాయి వాళ్ళతో ఒక విషయంలో గొడవవస్తే ఇక వాళ్ళను అన్ని విషయాల్లోనూ నీచులుగా చిత్రించే నా మనస్తత్వానికి నువ్వు క్షమించాలి. ఈ విషయాన్ని నువ్వు అర్థం చేసుకుంటే కథంతా ముగిసినట్లే' అన్నాడు.

అప్పుడే శివరావు, 'కామేశ్వర్రావుగారు చెప్పింది నిజమోయ్. మా ఆవిడ ఏమిటో చెప్తే, నేను పిచ్చిగా నమ్మేసి ఇలా కష్టాలను నెత్తిమీదికి తెచ్చుకున్నానోయ్ నిజానికి నేను చాల భయస్థుణ్ణి. సంఘానికిట్టే జడిసిపోయే పిరికివాణ్ణి. పాపం కమల, వీళ్ళ పాపతో ఆడుకోవడంకూడా సహించలేక పోయాను...' అన్నాడు.

ఇక నేనేమి చెప్పను? తుఫానులో చిక్కుకున్న నా యీ ఎదకేమి చెప్పను?

---

స్కెచ్

# గోవిందరావు మాష్టారు

"మధురశ్రీ"

శ్రీ మహాల క్ష్మీ హైస్కూలు గేటుదగ్గరవుండే ప్యూను వెంకన్న పరిభాష ప్రకారం గోవిందరావు మాష్టరు "డిసీమిసీ"అయ్యారన్న వార్త ఆ స్కూల్ హెడ్‌మాష్టరుగారితో సహా అందరినీ ఆశ్చర్యపరచి, ఆ తర్వాత ఆనందింపజేసింది.

గోవిందరావు మాష్టారంటే సామాన్యులటండీ! నెలకి యిరవైఅయిను బిళ్ళకుడుముల్లాంటి రూపాయల చొప్పున సమర్పించుకొని, సంవత్సరమంతా ఆయనదగ్గర ప్రయివేటు చెప్పించుకొని ఎస్. ఎస్. ఎల్. సి. తప్పిన వెధవలు...ఆట్టేమాట్లాడితే అంట్ల వెధవ... చెవులెగిన వెధవలు... "వంకాయ," "దోసకాయ," యిత్యాది పదజాలం కేవలం ఆయన్ని ఏడిపించేందుకు ఉపయోగిస్తారుగానీ ఆయన మహాత్మ్యం వాళ్ళకేం తెలుసు? (ఈమధ్యన ఒకానొక చలనచిత్ర నిర్మాత "గోవిందరావు మాష్టారి మహాత్మ్యం"అనే పిక్చరు తియ్యడానికి రహస్యంగా హక్కులు పుచ్చుకున్నాడని విశ్వసనీయ వర్గాలద్వారా తెలుస్తూంది.)